# మనసు చెప్పని మాట

పెళ్ళికూతుర్ని కళ్యాణ వేదికమీదికి తీసుకువచ్చారు. అంతవరకు అందరూ ఏమనుకుంటారో అనే భయంతో ఇష్టం లేకపోయినా అక్కడ వున్నాను. ఇక వుండడం నావల్ల కాలేదు. గబగబా అవతలికి వచ్చేశాను.

నా ప్రాణానికి ప్రాణమైన రాణి మరికొన్ని నిముషాల్లో పరాయి వ్యక్తికి భార్యయిపోతోంది. అతనికి ఇష్టముంటేనే రాణితో మాట్లాడాలి. లేకపోతే లేదు. ఏడుపు వస్తోంది.

బలవంతాన కన్నీళ్ళని అదుపులో పెట్టుకుంటూ గుడిదగ్గరకి చేరుకున్నాను.

అక్కడి పరిసరాలు నన్ను గతంలోకి లాక్కువెళ్ళాయి.

నేను, రాణి ఆడుకోడానికి అక్కడికి ఎన్నోసార్లు వచ్చాం. చిన్నప్పటినుండీ నాకు రాణితో తప్ప మరెవ్వరితోనూ ఆడడం ఇష్టం వుండేది కాదు.

తనకి కోపంవస్తే 'చిన్నపిల్లాడివి, నీతో నాకు ఆటలు ఏమిటి?' అనేది.

అంతే! నాకు చర్రున కోపం వచ్చేసేది.

నాకన్నా తను రెండేళ్ళు పెద్ద. అదీ బడాయి! తన ఆధిక్యతని చూపుకోవాలనుకున్నప్పుడల్లా 'చిన్న పిల్లాడివి నీకేం తెల్సు' అనేది. ఏ మాటనయినా భరించగలిగేవాణ్ని కాని. నన్ను చిన్నవాణ్ని చేస్తూ మాట్లాడితే మాత్రం భరించలేకపోయేవాణ్ని.



వయసుతోపాటే ఆమెమీద అభిమానం కూడా పెరగసాగింది. ఇద్దరం కలిసి స్కూలుకి వెళ్ళేవాళ్ళం, కలిసి ఆడుకునేవాళ్ళం. పక్క పక్క ఇళ్ళే కావడంతో ఇద్దరం ఎక్కువకాలం కలిసే వుండేవాళ్ళం.

ఒకరోజు స్కూల్‌కి వెళ్తూ రాణి కోసం వెళ్ళాను. "ఇవాళ నుంచి రాణి స్కూల్‌కి రాదురా..." అంది అత్తయ్య

నాకు విపరీతమైన కోపం వచ్చింది. ఏమిటి అత్తయ్య ఇట్లా మాట్లాడుతోంది?

"రాణి ఎక్కడుంది?" అడిగాను కోపాన్ని దిగమింగుకుంటూ.

"పెరట్లో..."

గబగబా అటు వెళ్ళాను.

నన్ను చూస్తూనే రాణి సన్నగా నవ్వింది. ఆ నవ్వులో సిగ్గుకూడా వుంది.

"రాణీ! నువ్వు స్కూలుకి రావా ఇవాళ్టి నుంచీ?" అడిగాను.

"ఊహూఁ..." రానన్నట్లు తల వూపింది.

"ఏం? ఎందుకు?" వుక్రోషంగా అడిగాను.

"చిన్నపిల్లాడివి, నీకు తెలీదులే ఇప్పుడు... కొన్నాళ్ళుపోతే నీకే అర్థమవుతుంది" అంది.

అంతే! నా కోపానికి హద్దులు లేకుండా పోయింది. ఇవతలికి వచ్చేశాను. ఒక్కణ్ణే స్కూలుకి వెళ్ళాలనిపించలేదు. అలా అలా తిరిగి ఎప్పటికో ఇంటికి చేరుకున్నారు.

రాణి వాకిట్లో పెద్ద పేరంటం చేశారు.

అప్పటినుంచీ మా ఇద్దరిమధ్యా దూరం పెరిగిపోసాగింది. ఇదివరకటిలా ఆడుకోవడానికి రావడం కూడా తగ్గించేసింది రాణి.

"నువ్వంటే చిన్నపిల్లాడివి. నేను నీలా ఆటలు ఆడితే నవ్విపోతారు ఎవరైనా." పెద్ద ఆరిందాలా అనేది. నాకు చిర్రెత్తుకొచ్చేది.

స్కూలు లేని సమయాల్లో ఇద్దరం వాళ్ళ పెరట్లోనో, మా పెరట్లోనో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వుండేవాళ్ళం.

హఠాత్తుగా ఓ రోజు స్కూలునుంచీ వచ్చేసరికి పిడుగులాంటి వార్త చెవినబడింది-రాణిని చూడడానికి ఎవరో వస్తున్నారు!

పెళ్ళి అంటే నాకు పూర్తి అర్థం తెలీకపోయినా రాణికి పెళ్ళి అంటే బాధగా అనిపించింది. అతనెవర్నో పెళ్ళి చేసేసుకుని రాణి నాకు దూరంగా వెళ్ళిపోతుందా? ఆ ఆలోచనని భరించలేకపోయాను.

సరాసరి ఆమె దగ్గరకి పరుగెత్తుకెళ్ళాను. బాధగా బాదం చెట్టు క్రింద కూర్చుంటుందనుకున్న రాణి అందంగా అలంకరించుకుని ఆనందంగా కనిపించేసరికి వళ్ళుమండిపోయింది.

"నీకు బాధగా లేదూ!" అడిగాను.

"ఎందుకు?"

"నిన్ను చూడడానికి ఎవరో వస్తున్నారటగా?"

"అవును...!" బాధకి బదులు ఆనందంతో కూడుకున్న సిగ్గుని ఆమెలో చూసేసరికి వుక్రోషం పెరిగిపోయింది.

"అతన్ని పెళ్ళిచేసుకుంటావా?"

"చిన్నపిల్లాడివి, నీకు ఈ మాటలన్నీ ఎందుకు? అవతలికెళ్ళు..."

మరుక్షణంలో ఇవతలికి వచ్చేశాను.

మాటిమాటికీ నన్ను చిన్నవాణ్ణి చేస్తూ మాట్లాడే రాణితో మాటలు తగ్గించాలనుకున్నాను. ఆ రోజల్లా రాణిని తప్పించుకుతిరిగాను.

"ఎందుకు నన్ను తప్పించుకు తిరుగుతున్నావ్?" మర్నాడు నిల దీసింది.

"నువ్వు పెద్దదానివి. నీతో మాట్లాడడానికి నేనెంత..." కళ్ళ వెంట నీళ్ళు వచ్చేశాయి నాకు.

"ఛ...ఎందుకలా కన్నీళ్ళు పెట్టుకుంటావ్? ఇంకెప్పుడూ నీతో అలా మాట్లాడనులే. కన్నీళ్ళు తుడుచుకో..."

అంత కోపమూ, బాధ ఒక్కసారి గాలిలో కలిసిపోయాయి. మళ్ళీ ఇద్దరం కలిసిమెలిసి వుండసాగాం. స్కూల్‌నుంచీ రాగానే నేను వాళ్ళింటికి వెళ్ళేవాణ్ణి, లేకపోతే తను మా ఇంటికి వచ్చేది.

నెలరోజులు కూడా తిరగముందే మరో పిడుగులాంటి వార్త!

ఈ మధ్య రాణిని చూసి వెళ్ళిన వాళ్ళకి రాణి నచ్చింది! త్వరలోనే ముహూర్తాలు పెట్టుకోబోతున్నారు. కానీ రాణిలో నాకు దిగులు కనిపించ లేదు.

"నీకు దిగులుగా లేదూ?" అడిగాను.

"ఎందుకు?" ఎదురు ప్రశ్న వేసింది.

''పెళ్ళటగా?''

"పెళ్ళయితే ఎవరికైనా దిగులేస్తుందేమిటి, ఆనందంగా వుంటుంది గాని! అందుకే నిన్ను చిన్నపిల్లాడనేది!!" ఆరిందాలా మాట్లాడుతున్న ఆమె మాటలు నన్ను మరింత ఇబ్బందిపెట్టాయి.

తను పిలుస్తున్నా వినిపించుకోక ఇవతలికి వచ్చేశాను.

రాణిమీద వచ్చిన కోపం నానుంచి రాణిని వేరుచేయబోతున్న 'ఆ పెళ్ళికొడుకు' వైపుకి మళ్ళింది.

రాణి పెళ్ళి నిశ్చయమైపోయింది.

గుండెలు తరుక్కుపోసాగాయి.

రాణి నాకు దూరం కావడం లేదు. ఆ దుర్మార్గుడు దూరం చేస్తున్నాడు.

"ఎందుకు నన్ను తప్పించుకు తిరుగుతున్నావ్?" నిలదీసింది ఆ రోజు రాణి.

''నేనేంకాదు, నువ్వే నన్ను తప్పించుకు పారిపోతున్నావ్!'' కళ్ళ వెంట నీళ్ళు వచ్చేశాయి.

''అతన్ని పెళ్ళిచేసుకోనని మీ వాళ్ళకు చెప్పెయ్!''

''ఎందుకు? చూస్తూ చూస్తూ మంచి సంబంధం వదులుకుంటారా ఎవరైనా?"

"అది మంచి సంబంధమా?"

"ఏం? అతను నీకు నచ్చలేదా?"

''ఏం నచ్చలా..." కోపం పెరిగిపోయింది నాలో.

''పో కొంటెపిల్లాడా!'' చిన్న మొట్టికాయ వేసి లోపలికి వెళ్ళి పోయింది.

పెళ్ళి దగ్గరపడుతున్నకొద్దీ దిగులు పెరిగిపోసాగింది. రాణిని సొంతం చేసుకోబోతున్న అతనిమీద కూడా పెరిగిపోసాగింది కోపం.

నా బాధని పట్టించుకునేవారు లేరు. అసలు రాణి పెళ్ళికి ఈ వూళ్ళోనే వుండకూడదనుకున్నాను. కానీ అమ్మ బలవంతంమీద వుండి పోవాల్సి వచ్చింది. కంటిముందు ఇంత ఘోరం జరిగిపోతున్నా చూస్తూ ఏడుస్తూ కూర్చునే పరిస్థితి కలిగేదికాదు.

మంచి జరుగుతున్నా, చెడు జరుగుతున్నా కాలం ఎవ్వరికోసమూ ఆగదు. రాణి 'అతని'తో అత్తారింటికి వెళ్ళిపోయింది. నేనూ కాలేజీ చదువులకి ఆ వూరు వదిలేశాను.

రాణి నా అడ్రసు తెలుసుకుని రెండు మూడు వుత్తరాలు రాసింది కాని నేనే జవాబీయలేదు కోపంతో!

నాకు శలవులు ఇచ్చి నేను ఇంటికి వచ్చినప్పుడు రాణి వచ్చేది కాదు. రాణి వచ్చినప్పుడు నేను వెళ్ళేవాణ్ణికాదు.

మరో రెండు సంవత్సరాలు గడిచిపోయాయి.

ఇంటికి వెళ్ళినప్పుడల్లా అమ్మ చెబుతుండేది-రాణిని అతను ఎంతో ఆప్యాయంగా చూసుకునేవాడని, అతను ఈ మధ్య స్కూటర్ కొన్నాడని, ప్రమోషన్ వచ్చిందని...ఇలా ఏవేవో!

ఆ సంగతులు విన్నప్పుడల్లా వళ్ళు మండిపోయేది. అతనెవరు రాణి మీద ఆప్యాయత కురిపించడానికి అనికూడా అనిపించేది. అతను మోజుపడి కొనుక్కున్న ఆ స్కూటర్‌కి యాక్సిడెంట్ అయితే బావుండని కూడా తలపోసేవాణ్ణి. నా ఆలోచన్లు నాకే బాధనిపించేవి. అయినా అతని గురించి వ్యతిరేకంగా ఆలోచిస్తుంటే అదో తృప్తి!

ఆలోచనల్లో ఎంతో ఆనందాన్ని ఇచ్చిన విషయాలు, అను కున్నట్లుగా జీవితంలో జరిగినా బాధిస్తాయి అనే విషయం ఆ రోజే నాకు తెలిసింది.

నా శాపనార్థాలవల్లే అలా జరిగిందేమోననే ఆలోచన కూడా నన్ను కలచివేసింది.

రాణి భర్త స్కూటర్ యాక్సిడెంట్‌లో చనిపోయాడు. నేను కోరు కున్నదే అది అయినా భరించలేకపోయాను. వెంటనే బయల్దేరాను.

నవ్వుతూ తుళ్ళుతూ కనిపించే రాణి బొట్టులేకుండా కళా విహీన మైన మొహంతో కనిపించేసరికి కడుపులో దేవినట్లయింది. కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి.

రాణిని అలా చూడలేక ఇవతలికి వచ్చేశాను. ఆమెకి అలా రగాలని అంతకుముందు ఎన్నోసార్లు వూహించినందుకు నన్ను నేనే ట్టుకున్నాను.

రాణి జీవితం అప్పుడే మోడువారిపోవడానికి వీల్లేదు. ఏంచేయాలి?

తీవ్రంగా ఆలోచించాను.

రాణికి దూరంగా వుండడం నాకూ కష్టమే. ఆఖరికి ఓ నిర్ణయానికి వచ్చాను. వెంటనే ఆ విషయం బయటపెడితే బాగుండదు. బలవంతాన ఓ నెలరోజులు గడిచాయి.

ఒక రోజున రాణి వంటరిగా కనిపించింది. ఇదే మంచి సమయం. ఎప్పుడూ నన్ను చిన్నపిల్లవాణ్ని చేసి మాట్లాడే రాణికి నేనెంత పెద్దవాణ్ణయ్యానో తెలియజెయ్యాలనే తపన పెరిగిపోయింది.

నెమ్మదిగా దగ్గరకి వెళ్ళాను.

పెరట్లో చెట్టుకింద ఆమెనలా చూస్తుంటే అశోకవనంలో సీతలా అనిపించింది. ఆ సీత భర్తకి దూరమై తపిస్తే ఈ సీత భర్తని కోల్పోయి పరితపిస్తోంది. నువ్వు ఎప్పుడూ ఒంటరిదానివి కాదు అని ఆమెకి చెప్పాలి.

"రాణీ..." నెమ్మదిగా పిలిచాను. తలెత్తి చూసింది.

తెల్లటి మొహం మరింతగా పాలిపోయింది.

ఊహూఁ...ఆమె మొహం ఎప్పుడూ కళకళలాడుతుండాల్సిందే!

"నీతో ఒక చిన్నమాట చెప్పాలని వచ్చాను..." ఉపోద్ఘాతాన్ని తగ్గించి వెంటనే విషయాన్ని చెప్పేయాలనుకున్నాను.

"ఏమిటి?" నూతిలోంచి వచ్చింది మాట.

"నీ జీవితం ఇలా మోడువారిపోవడానికి వీల్లేదు. వచ్చేనెలలో నా చదువు కూడా అయిపోతుంది. ఉద్యోగం రాగానే...నీకు అభ్యంతరం లేకపోతే నిన్ను పెళ్ళిచేసుకోవాలని..." నసిగాను.

అంత బాధలోనూ చిన్నగా నవ్వింది రాణి.

"చిన్నపిల్లాడివి, నీకు తెలీదు. జీవితమంటే కథకాదు, సినిమాకాదు! నీకన్నా వయసులో పెద్దదాన్ని, విధవని చేసుకుంటే ముందుముందు ఎన్నో అనుకోని సమస్యల్ని ఎదుర్కోవలసి వస్తుంది. నా మంచికోసం నువ్వు ఎలా ఆలోచిస్తుంటావో, నీ మంచికోసం నేనూ అలానే ఆలోచిస్తుంటాను. ఇట్లాంటి పిచ్చి ఆలోచన్లు కట్టిపెట్టి బాగా చదివి మంచి మార్కులతో పాస్‌గా...అప్పుడు నేనే సెలెక్టుచేస్తాను నీకో మంచి పిల్లని!" రాణి చటుక్కున లోపలికి వెళ్ళిపోయింది. శిలాప్రతిమలా అలాగే నిలబడి పోయాను. *

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)